ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 21 | సంచిక : 1 | సెప్టెంబర్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ|| 150/-
విడి ప్రతి : రూ|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

31-07-2015
భీమవరం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (రామకృష్ణగారి ప్రవచనము, భీమవరం 31-07-2015)

పరమేశ్వర స్వరూపులైన నాన్నగార్కి, ఈ సమావేశానికి విచ్చేసిన అశేషప్రజానీకానికి నా హృదయపూర్వక నమస్కారములు.

ఈ రోజు గురుపూర్ణిమ పుణ్యదినోత్సవం. శ్రీమన్నారాయణుడు దగ్గరనుండి నాన్నగారి వరకు ఉన్నటువంటి గురుపరంపర అందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. గురుతత్వం ఏమిటి? గురువు ప్రాధాన్యత ఏమిటి? జీవితంలో, అని నేను తెలుసుకొన్నది సరిగ్గా 21 సంవత్సరాల క్రితం ఈ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన కొత్తలో సద్గురువు నాన్నగారి యొక్క దర్శనభాగ్యం నాకు కలిగింది. రమణమహర్షి యొక్క సిద్ధాంతసారాన్నంతా సామాన్యులకు అర్థమయ్యే భాషలో చెప్పి ఎంతమందినో పునీతులను చేసిన మహామనిషి సద్గురువు నాన్నగారు. ఇప్పుడు వారి దర్శనం ఇప్పిస్తాము అని చెప్పారు. ఋషిరూపంలో కౌపీన జటాధారులన్నీ ఉన్నటువంటి రూపంలో వారు కనిపిస్తారు అనుకొన్నాను కానీ చూస్తే ఎప్పుడో గతించినటువంటి మా నాన్నగారు నా మీద చూపించేటువంటి ఆర్ధ్రతాభావం ఎలా ఉంటుందో ఆ ఆర్ధ్రతాభావంతోటి, చిరునవ్వుతోటి నాన్నగారిని చూడటం జరిగింది. అంటే గురుస్వభావం ఎలా ఉంటుంది అన్నదానిమీద మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి. గురువు ఒక ప్రత్యేకమైన వేషంతోటి, ఒక ప్రత్యేకమైన రూపంతోటి వస్తారు అనేటువంటి అపోహ భక్తులకు పనికిరాదు. గురురూపం ఎలాగైనా ఉండవచ్చు. అందుకే దత్తాత్రేయులవారు గురువు 24 రూపాలలో నాకు కనిపించారు అని చెప్పారు. అందుచేత స్వస్వరూప అనుసంధానం కోసం, మన స్వరూపం మనకు బోధించడానికి వచ్చేటువంటి గురువు యొక్క తత్వం సరిగా అర్థం చేసుకొన్నప్పుడు ఆ గురుబోధనలను, గురువు యొక్క

ప్రవర్తనని, గురువుయొక్క సామీప్యాన్ని సమంగా అర్థం చేసుకోగల అవకాశం మనకు వస్తుంది.

గురువులు సాధారణంగా శిష్యులకు దీక్షలు ఇచ్చే విధానాలు శాస్త్రీయంగా మూడు పద్ధతులు అని చెపుతారు. మత్స్యదీక్ష, కుక్కుటిదీక్ష, మకటదీక్ష, చేప గుడ్లు పెట్టినప్పుడు ఆ గుడ్లను పొదగడానికి దోహదకారిగ వాటిని చూస్తు వెళుతుంది. కేవలం చూడటం వలన ఆ గుడ్లు పొదిగి చేపపిల్లలుగా తయారవుతాయి. తాబేలు ఏమి చేస్తుంది అంటే ఒడ్డుకు వచ్చి యిసుక తవ్వి అందులో గుడ్లు పెట్టి వెళ్ళిపోతుంది. కాని తాను పెట్టినగుడ్లు పొదగాలని, ఆరోగ్యంగా ఎదగాలని మనస్సులో నిత్యం ఆలోచిస్తూ ఉంటుంది. అంటే నేత్రదృష్టి లేదుకాని ఆలోచనాదృష్టి ఉంది, ఆ గుడ్లను మనస్సులో పెట్టుకొంది. కుక్కుటిదీక్ష అంటే కోడి గుడ్లు పెట్టిన తరువాత వాటి మీద కూర్చుని, వాటిని స్పర్శించి పొదుగుతుంది. గురువులు ఈ మూడు రకాల దీక్షలు ఇస్తూ ఉంటారు. ఎవరికి ఏ దీక్ష ఇస్తారు? ఒకరోజు మనం గురువు దగ్గరకు వెళతాము. మనలను పలకరించి అందరికంటే ముందుగా కుర్చీవేసి కూర్చోబెడతారు. అప్పడు మన మనస్సులో నేను గురువుకు ప్రాధానీకుడిని మిగతా శిష్యులు అంతా సెకండరీ అని బయలుదేరుతుంది. గురువుకు నేను ప్రాధానీకుడిని అనే అభిప్రాయమే అహంకారం. గురువుకు అందరూ సమానమే. అయితే దేనిమీద ఆధారపడి ఈ దీక్షలు ఇస్తారు అంటే మన అహంకారం యొక్క స్వరూపాలు ఎలా మారుతున్నాయో దానినిబట్టి వారు ఇస్తారు. ఒకోసారి మనం అంటాము ఎప్పడూ మనం కనబడగానే ప్రీతిగా మాట్లాడే గురువుగారు ఈరోజు అసలు మాట్లాడనేలేదు ప్రక్కన ఎవరితోనో మాట్లాడారు అంటాము. అంటే గురువు యొక్క స్వరూపాన్ని అర్థం చేసుకోక ఈ రకమైన అనుమానాలు మనకు వస్తూ ఉంటాయి. జిన్నూరు నాన్నగారిలాంటి గురువుగారు నేను చూసినటువంటి గురుతత్వంలో చాలా అరుదుగా కనిపించేటువంటి వ్యక్తి. 1994వ సంవత్సరంలో నాకు పరిచయం అయిన తరువాత ఇప్పడు 2015 అంటే ఈ 21 సంవత్సరాల నుండి వారు నన్ను ప్రభావితం చేస్తున్నారు. నేను చూసింది ఏడాదికో, రెండేళ్ళకో ఒకసారి వచ్చి వారి పాదస్పర్శతీసుకొని వెళతాను. కాని వారు నిరంతరం లోపలఉండి ఎప్పటికప్పడు నాకు ప్రబోధిస్తూ, అనేక క్లిష్టమైన సమస్యలు పరిష్కారం లేకుండా ఉన్నప్పడు నాకు వాటికి సులభమైన పరిష్కారాలు తోపించి ఎప్పటికప్పడు నన్ను నడిపిస్తున్నారు. ఇది గురుతత్వం యొక్క ప్రధానమైన అంశం. గురువు మనకు కనబడినప్పడు మనతో ఎలా ఉన్నారు అనేది కాకుండా మన మనస్సులను ప్రభావితం చేసే విధానం మనకు తెలిసిపోతుంది. గురుకృప అంటే అది. వారు నిత్యం మనకు సన్నిహితంగా ఉండకపోయినా ఒకసారి మనతో మాట్లాడారు అంటే, ఒకసారి వారి చూపు మనమీద పడింది అంటే చాలు. ఒకసారి

హైదరాబాద్‌లో ఒక మీటింగులో నాన్నగారు ఏమన్నారు అంటే రామకృష్ణగారికి ఒక దండవేయండి అన్నారు. అంటే నేను అన్నాను స్వామీ మీచూపు వెయ్యిదండల సాటి వస్తుంది చూపు చాలు కదా, ఇంక దండ ఎందుకు అన్నాను. వారి అనుగ్రహం, ఆర్థత, వారిచూపు చాలు. అయితే కొన్ని అనుభవాలు కూడా ఉన్నాయి. మనం నిత్యజీవితంలో చూసే అనేక సమస్యలలో మా మిత్రుడు ఒక ఆయన సైంటిస్టు, కూతురుపెళ్ళి అవ్వటంలేదని వర్రీపడుతూ ఉండేవాడు. ఒకసారి ఆయన కూడా నాతోపాటు జిన్నూరు వచ్చాడు, నాన్నగారి దర్శనం అయ్యింది, మాట్లాడాము, ఆశీర్వదించారు, వెళ్ళిపోయాము. ఆయన వెళ్ళేటప్పటికి అనూహ్యంగా మగపెళ్ళివారు ఎదురు చూస్తున్నారు వీళ్ళని వెతుక్కుంటూ, అంతవరకు వారు మాట్లాడుకోలేదు. తరువాత ఆ మిత్రుడు నాతో చెప్పాడు "ఏమిటి నాన్నగారిలో అపారమైన మహిమ కూడా ఉందా!" అని. కాని నాన్నగారు మహిమల గురించి ఎప్పుడూ చెప్పలేదు, అది నిజమైనభక్తులకు, నాన్నగారిని మనస్సులో సుప్రతిష్టలను చేసుకొన్న భక్తులకు అనుభవాల రూపంగా గోచరించింది. ఇది నేను విన్న విషయం, నాకు జరిగిన విషయం.

కేవలం కొన్ని దైహికమైన ఆశీర్వచనాలు ఇస్తేనో లేకపోతే కొన్ని మహిమలు చేస్తేనో గురువు అనే పద్ధతిలో కాకుండా శిష్యులకు తత్త్వాన్ని బోధించాలి, నేనెవరు అనేది వారు తెలుసుకొనేటట్లు చేయాలి. సామాన్యమైన గృహిణులు కొన్నివేలమంది ప్రభావితమై వారి జీవితాలను ఎంతో సుఖవంతం చేసుకొంటున్నారు అంటే, ఈ రోజున మహాపండితులకు కూడా అర్థకాని తార్కిక విషయాలను అందరకూ సులభంగా అర్థమయ్యే భాషలో నాన్నగారి అమృతవచనాల ద్వారా మనకు అందుతున్నాయి అంటే ఇది మనందరి అదృష్టం. ఇటువంటి గురువు దొరకటం మనందరి సామూహిక అదృష్టం. ఈ గురుపూర్ణిమ రోజున శిరస్సు వంచి వారి పాదకమలాలకు నేను హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. కాని నమస్కరించటం కొంచెం కష్టం ఎందుచేతనంటే వారి పాదకమలాలు బయటలేవు, గుండెల్లోనే ఉంటే ఎలా నమస్కరిస్తాము? అంటే నిత్యం మనతోనే ఉన్నారు గురువుగారు. ఇటువంటి గురువుగారి సన్నిధానం దొరికిన నేను ఎంతో అదృష్టవంతుడిని. అల్లుడనైన నన్ను పిలిచి నువ్వు ముందు మాట్లాడు అంటే ఆదేశమే, గురువు ఆదేశం ఏమి చేస్తాము, మనం మాట్లాడి తీరవలసిందే. మనకు మాట్లాడే సమర్థత లేకపోయినప్పటికీ, అంత చాతుర్యం, అంత వాక్కు వైభవం లేకపోయినప్పటికి కూడా గురువుగారు చెప్పినప్పుడు ఆజ్ఞగా పాటించి మాట్లాడాలి అని, ఈ రెండు మాటలు మాట్లాడటానికి మీ సమక్షంలో ధైర్యం చేసాను. మీ అందరికి హృదయపూర్వక నమస్కారములు.